సాక్షి
కుమురం భీం

శనివారం, 29, జూన్, 2024



'పరిషత్'లలో ప్రత్యేక పాలన?
జూలై 4, 5 తేదీల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం పూర్తికానుంది. జిల్లా, మండల ప్రజా పరిషత్‌లు ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లనున్నాయి. 8లో▸



ముంచెత్తిన వరద
వాంకిడి మండలంలోని పలు గ్రామాలను వరద ముంచెత్తింది. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో ఇళ్లలోకి మోకాలు లోతు నీరు చేరింది. 9లో▸

గరిష్టం/కనిష్టం 33.4 /26.5

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాలు, ఉపరితల ద్రోణి ప్రభావంతో చాలాచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 2024– 25 సంవత్సరంలో అర్హులైన షెడ్యూల్డ్ కులాల న్యాయశాస్త్ర పట్టభద్రుల నుంచి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సజీవన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్లపాటు న్యాయ పరిపాలనలో శిక్షణ కోసం న్యాయాధికారికి జత చేస్తామని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ప్రతినెలా రూ.3వేల శిక్షణ భృతి అందించడంతోపాటు న్యాయశాస్త్ర గ్రంథాలు, ఇతర ఫర్నీచర్ కొనుగోలు కోసం రూ.50వేలు మంజూరు చేస్తామని తెలిపారు. 30 ఏళ్లలోపు అర్హులైన వారు https://telanganaepass.cgg.gov.in ను సందర్శించాలని సూచించారు.

అతిథి అధ్యాపకుల నియామకం కోసం..
కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకం కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం తెలిపారు. చరిత్ర, ఇంగ్లిష్, తెలుగు, కంప్యూటర్ సైన్స్, రాజనీతి శాస్త్రంకు సంబంధించి ఒక్కో పోస్టు, కామర్స్‌లో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు జూలై 2లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు సంబంధిత విభాగం పీజీలో 55 శాతం మార్కులు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు ఉండాలని సూచించారు.

రేపు కాగజ్‌నగర్‌కు మంత్రి సీతక్క



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఈ నెల 30న కాగజ్‌నగర్‌లో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే హరీశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలోని రెండు ఆయుష్మాన్ ఆరోగ్యమందిరాలు (సబ్ సెంటర్లు), వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద మిషన్ భగీరథ అర్బన్ పథకం, నజ్రూల్‌నగర్ విలేజ్ నం.12లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం దహెగాం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారన్నారు. కాగా.. కాగజ్‌నగర్ పట్టణంలో మిషన్ భగీరథ పనుల ప్రారంభోత్సవానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క రానుండటంతో ఎమ్మెల్యే హరీశ్‌బాబు ఆదేశాల మేరకు శుక్రవారం మిషన్ భగీరథ డీఈ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఏఈ అనిల్, బీజేపీ నాయకులు సిందం శ్రీనివాస్, డెబ్బుటి శ్రీనివాస్ తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.

'తులం బంగారం హామీ నెరవేర్చాలి'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

వాంకిడి: గత ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన కల్యాణలక్ష్మి పథకాన్ని కొనసాగిస్తూ.. తులం బంగారం ఇస్తామనే కాంగ్రెస్ హామీని నెరవేర్చాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం 76 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారు ఆరు గ్యారంటీలలో ఏ ఒక్కటీ తగ్గకుండా అమలయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విమలాబాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, తహసీల్దార్ రోహిత్, పీఏసీఎస్ చైర్మన్ పెంటు, వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీటీడీవో రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులకు నిర్వహించిన వృత్యంతర శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీటీడీవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు విధులు సక్రమంగా నిర్వహిస్తూ.. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలన్నారు. గత విద్యా సంవత్సరంలో ఆశ్రమ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, కోర్సు డైరెక్టర్ కృష్ణరావు, డీఆర్‌పీ వామన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అందిన ప్రోత్సాహకం



రెబ్బెన శివారులోని ఆయిల్‌పాం తోటలో అంతర పంటగా సాగు చేస్తున్న వేరుశనగ పంట

- 2023- 24 సంవత్సరానికి సంబంధించి ప్రోత్సాహకాలు విడుదల
- ఆయిల్‌పాం సాగు చేస్తున్న రైతుల ఖాతాల్లో జమ
- జిల్లాలో 944 ఎకరాలకు రూ.39.66 లక్షలు విడుదల

రెబ్బెన(ఆసిఫాబాద్): ఎట్టకేలకు ఆయిల్‌పాం సాగు చేస్తున్న రైతుల ఖాతాల్లో ప్రోత్సాహక నగదు జమైంది. సాంప్రదాయ పంటలకు భిన్నంగా వాణిజ్య పంటల సాగు పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు అందిస్తూ రైతులను ప్రోత్సహిస్తోంది. అందులో భాగంగానే ఉద్యానవన శాఖ జిల్లాలోని రైతులను ఆయిల్‌పాం తోటల సాగు వైపు మళ్లించేందుకు చర్యలు చేపట్టింది. ఆయిల్‌పాం సాగుతో కలిగే ప్రయోజనాలను వివరిస్తూ విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మూడేళ్ల క్రితం జిల్లాలో సాగు ప్రారంభం కాగా.. ప్రభుత్వం సబ్సిడీపై మొక్కలతోపాటు డ్రిప్ సిస్టం అందిస్తుండటంతో క్రమంగా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈ క్రమంలో 2023- 24 సంవత్సరానికి సంబంధించి తోటల నిర్వహణ, అంతర పంటల సాగుకు సంబంధించిన ప్రోత్సహకాలను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది.

పెరుగుతున్న సాగు విస్తీర్ణం
మూడేళ్ల క్రితం జిల్లాలో ఆయిల్‌పాం తోటల సాగు ప్రారంభమైంది. ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. తోటల నిర్వహణతోపాటు అంతర పంటల సాగు నిర్వహణ ఖర్చులను సైతం ప్రభుత్వమే భరిస్తుండటంతో అన్నదాతలు ముందుకొస్తున్నారు. 520 ఎకరాలతో ప్రారంభం కాగా ప్రస్తుతం 1020 ఎకరాలకు విస్తరించింది. సాంప్రదాయ పంటల సాగుకు ఏర్పడుతున్న ప్రతికూల పరిస్థితులు, పెరిగిన పెట్టుబడితోపాటు పండిన పంటలకు సరైన గిట్టుబాటు ధర లభించడంలేదు. స్థానిక నేలలు కూడా ఆయిల్‌పాం సాగుకు అనుకూలంగా ఉన్నాయి. అయితే ఈ తోటల సాగుకు నీటి వసతి తప్పనిసరి. ఇతర పంటల సాగుతో పోల్చితే ఈ పంటలో నీటి వినియోగం కాస్త ఎక్కువగా ఉంటుంది. దీంతో జిల్లా రైతులు వాగులు, బోరుబావుల ఆధారంతో ఆయిల్‌పాం తోటల సాగు చేస్తున్నారు.

944 ఎకరాలకు రూ.39,66,480
ఆయిల్‌పాం తోటల సాగును పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. మొదటి నాలుగేళ్లపాటు ఎలాంటి ఆదాయం వచ్చే అవకాశం లేదు. ఈ నాలుగేళ్లపాటు తోటల నిర్వహణ, ఎరువులు, ఇతర ఖర్చుల కోసం రైతులకు అండగా నిలవాలని గత ప్రభుత్వం భావించింది. మొదటి నాలుగేళ్లు తోటల్లో అంతర పంటల సాగుకు వెసులుబాటు కల్పించింది. అలాగే అంతర పంటల సాగుకు ప్రోత్సాహక నగదు అందించాలని నిర్ణయించింది. ఆయిల్‌పాం తోటల నిర్వహణ కోసం ఎకరానికి రూ.2100తో పాటు అంతర పంటల సాగు కోసం అదనంగా రూ.2100 చెల్లిస్తున్నారు. అయితే 2023- 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రోత్సాహకాలు పెండింగ్‌లో ఉండటంతో జిల్లా రైతులు కొంతమేర ఇబ్బందులకు గురయ్యారు. కొన్ని నెలలుగా అన్నదాతలు ఎదురుచూస్తుండగా.. ఎన్నికల కోడ్ కారణంగా ప్రభుత్వం సైతం నిధులు విడుదల చేయలేకపోయింది. ఇటీవల ఎన్నికల కోడ్ ముగియటంతో ప్రభుత్వం జిల్లాలోని 944 ఎకరాలకు రూ.39,66,480 నగదును రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. మొదటి సంవత్సరం పంట కింద 121 మంది రైతులకు చెందిన 450 ఎకరాలకు ఎకరానికి రూ.4200 చొప్పున మొత్తం రూ.18,90,000 చెల్లించారు. ఇక రెండో సంవత్సరం పంట కింద 121 మంది రైతులకు 494 ఎకరాలకు రూ.20,76,480 నగదు జమ చేశారు.

ఖాతాల్లో జమ



జిల్లాలో ఆయిల్‌పాం సాగు చేసే రైతులకు తోటల నిర్వహణ, అంతర పంటల సాగు కోసం అందించే ప్రోత్సాహకాలను ప్రభుత్వం ఇటీవలే విడుదల చేసింది. జిల్లా రైతుల ఖాతాలో నిధులు జమయ్యాయి. జిల్లాలో 944 ఎకరాలకు రూ.39,66,480 నగదు జమ చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా ప్రోత్సాహకాలు అందడంలో కాస్త ఆలస్యమైంది.
– ఎంఏ నదీం, ఉద్యానవన డివిజన్ అధికారి

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



ఆయుధం పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్: పోలీసులు విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో డీసీఆర్‌బీ, ఐటీకోర్, డీపీవో విభాగాల కార్యాలయాలను శుక్రవారం అకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. కొన్ని రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వీలయినంత త్వరగా అప్‌డేట్ చేయాలన్నారు. పోలీసు అధికారులు, సిబ్బందికి సంబంధించిన సర్వీసు పుస్తకాలు, సెలవుల వివరాలతోపాటు అన్ని రకాల రిజిస్టర్లు పరిశీలించారు. ప్రతీ విషయం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని భరోసా కేంద్రం, ఏఆర్ హెడ్ కార్టర్స్‌ను సందర్శించారు. భరోసా సెంటర్‌లో ఇప్పటివరకు రిజిస్టర్ అయిన కేసులు, సాయం పొందిన మహిళలు, బాలికల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లోని మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం, ఏఆర్ అడ్మిన్ ఆర్ఐ కార్యాలయం తనిఖీ చేశారు. బెల్ ఆఫ్ ఆమ్స్‌లోని ఆయుధాలు, వాటి కండిషన్ గురించి ఆరా తీశారు. ఆయుధాలను నిత్యం శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఎస్‌బీ సీఐ రాణాప్రతాప్, డీసీఆర్‌బీ సీఐ రమేశ్, అడ్మిన్ ఆర్ఐ పెద్దయ్య, ఎంటీఆర్ అంజన్న, భరత్ భూషన్, ఏవో శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

'పది' సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

- 62.25 శాతం ఉత్తీర్ణత

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. జిల్లాలో మొత్తం 1,110 మంది పరీక్షలకు హాజరు కాగా.. 691 మంది ఉత్తీర్ణులయ్యారు. 62.25 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 665 మంది బాలురుకు 389 మంది ఉత్తీర్ణులు కాగా.. 445 మంది బాలికలకు 302 మంది పాసయ్యారు. 419 మంది విద్యార్థులు ఫెయిలయ్యారని డీఈవో అశోక్ తెలిపారు. కాగా.. జిల్లాలో పదో తరగతి రెగ్యులర్ పరీక్షలకు 6,393 మంది విద్యార్థులు హాజరు కాగా 5,325 మంది ఉత్తీర్ణులు కాగా.. 1,068 మంది ఫెయిలయ్యారు.

బొగ్గు బ్లాకులన్నీ సింగరేణికే కేటాయించాలి


రెబ్బెన(ఆసిఫాబాద్): రాష్ట్రంలోని బొగ్గు బ్లాకులన్నింటినీ కేంద్ర ప్రభుత్వం నామినేషన్ పద్ధతిలో సింగరేణి సంస్థకే కేటాయించాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. గోలేటిటౌన్‌షిప్‌లోని టీబీజీకేఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణకు చెందిన బొగ్గు బ్లాకులను వేలంలో పెట్టకుండా ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణికే కేటాయించాలన్నారు. శ్రావణ్‌పల్లి బ్లాకును స్వయంగా కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్ కేంద్రంగా వేలం వేయడం సరికాదన్నారు. దానికి కాంగ్రెస్ ప్రభుత్వం వంత పాడుతోందని ఆరోపించారు. తెలంగాణ బొగ్గు బ్లాకులను వేలం నుంచి తొలగించి సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. బొగ్గు బ్లాకుల వేలాన్ని నిరసిస్తూ జూలై 1న టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో అన్ని గనులపై నల్లబ్యాడ్జీలతో నిరసనలు చేపట్టి అధికారులకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. జూలై 3న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మల దహనం, 6న జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించి, 9న గోదావరిఖని కేంద్రంగా టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సెంట్రల్ కమిటీ నాయకులు మంగీలాల్, ఓరం కిరణ్, ఏరియా కార్యదర్శులు మారిన వెంకటేశ్, అలవేణి సంపత్, ఏరియా నాయకులు రాజేశం, దేవేందర్, స్వామి, రమేశ్, బాపు, సంజీవ్, చందర్, మారుతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు

ఉండేదెవరో.. వీడేదెవరో..?

- 'గులాబీ' పార్టీలో అంతుచిక్కని నేతల వైఖరి
- అధికార పార్టీవైపు కీలక నేతల చూపు
- బలహీన పడుతున్న కేడర్
- ఉమ్మడి జిల్లాలో పట్టు కోల్పోతున్న బీఆర్ఎస్



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా తగిలిన ఎదురుదెబ్బలతో భారత రాష్ట్ర సమితి నేతలు పక్క చూపులు చూస్తున్నారు. సీనియర్ నేతలతోపాటు తాజా, మాజీ ప్రజాప్రతినిధులు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీలో ఎవరు ఉంటారో.. ఎవరు పోతారో తెలియని పరిస్థితి. దీంతో కేడర్‌లోనూ అయోమయం నెలకొంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీ మరింత బలహీన పడితే ఇబ్బందులు తప్పవని భావిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామ, మండల, మున్సిపల్‌తో పాటు నియోజకవర్గ, జిల్లాస్థాయి ప్రజాప్రతినిధులు పార్టీని వీడకుండా అధినేత చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదని తెలుస్తోంది.

ఎన్నికల ముందు నుంచే వలసలు
అసెంబ్లీ ఎన్నికల ముందే బీఆర్ఎస్ నుంచి వలసలు మొదలయ్యాయి. వరుస ఎన్నికల్లో ఓటమి తర్వాత ఇవి మరింత ఊపందుకున్నాయి. అసెంబ్లీ టికెట్ రాకపోవడంతో అప్పటి బోథ్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపూరావు, రేఖానాయక్ బీఆర్ఎస్‌ను వీడారు. ఇక పార్లమెంట్ ఎన్నికల సమయంలో పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత గులాబీ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఇదే సమయంలో ఉమ్మడి జిల్లాలో సీనియర్ నాయకులైన మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ బీఆర్ఎస్‌ను వీడి అధికార హస్తం పార్టీలో చేరారు.

తాజా పరిస్థితులతో కలవరం..
ఇక రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీని నాయకులు వీడుతున్నారు. ఎమ్మెల్యేలు అధికార పార్టీలో చేరుతున్నారు. తాజా రాజకీయ పరిణామాలు ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ కేడర్‌ను కలవరపెడుతోంది. ఇప్పటికే కీలక నేతలు పార్టీ వీడినందున.. పది నియోజకవర్గాల్లోని మిగిలిన సీనియర్ నాయకులతోపాటు ద్వితీయ శ్రేణి నాయకత్వం కూడా పార్టీ వీడుతోంది. మున్సిపల్, మండల, జిల్లా పరిషత్‌లోని ప్రజాప్రతినిధులు అధికార పార్టీలోకి క్యూ కట్టారు. పట్టణ, ప్రాథమిక వ్యవసాయ సంఘాల్లో అవిశ్వాస తీర్మానాలతో బీఆర్ఎస్ నాయకుల్ని గద్దె దించారు. కొన్నిచోట్ల పాలకవర్గాలే గంపగుత్తగా పార్టీని వీడాయి.

ఇద్దరు ఎమ్మెల్యేలు, ఓ ఎమ్మెల్సీ
ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పరిధిలో బీఆర్ఎస్ పార్టీకి బోథ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలు అనిల్‌జాదవ్, కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్ మాత్రమే మిగిలారు. లోక్‌సభ ఎన్నికల్లో ఈ ముగ్గురే పార్టీ కోసం పనిచేశారు. కానీ ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగిన మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు డిపాజిట్ దక్కించుకోలేకపోగా, పెద్దపల్లి అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ మూడోస్థానానికి పరిమితమయ్యారు. ఈ ఎన్నికల ఫలితాల తర్వాత అటు ఆదిలాబాద్, ఇటు పెద్దపల్లి పరిధిలో ఉద్యమ కాలం నుంచి పార్టీని నమ్ముకుని ఉన్న కార్యకర్తల్లో నైరాశ్యం నెలకొంది. సింగరేణి పరిధిలో కార్మిక సంఘ నాయకులు సైతం పార్టీ అనుబంధ తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘాన్ని వీడుతున్నారు. ఎమ్మెల్సీ దండే విఠల్ పార్టీ కార్యక్రమాలకు అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఆయన పార్టీ మారుతారన్న చర్చ కూడా సాగుతోంది.

ఎమ్మెల్యేలకు కాంగ్రెస్, బీజేపీ గాలం..
ఇక ఉమ్మడి జిల్లాలో ఉన్న ఆసిఫాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు ఇటీవలే బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి వచ్చారు. పార్టీలోనే ఉంటామని చెబుతున్నారు. అయితే ఈ ఇద్దరు ఎమ్మెల్యేలకు రాష్ట్ర అధికార పార్టీ కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ గాలం వేస్తున్నాయి. ఈ మేరకు ఆహ్వానాలు అందాయి. అయితే ఈ ఇద్దరు ఎమ్మెల్యేల నుంచి స్పందన రాకపోవడంతో చేరికలు నిలిచిపోయాయి. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ పార్టీ మారే సమయంలోనే కోవ లక్ష్మి మారుతారనే ప్రచారం జరిగింది. కానీ ఆమె పార్టీలోనే ఉండాలని నిర్ణయించుకున్నారు.

ఆర్ఎస్పీ చేరికతో ఊరట..
మరోవైపు అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిన అప్పటి బీఎస్పీ రాష్ట్ర చీఫ్ మాజీ ఐపీఎస్ అధికారి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ (ఆర్ఎస్పీ) బీఆర్ఎస్‌లో చేరిక కొంత ఊరట కలిగింది. ప్రస్తుతం సిర్పూర్ నియోజకవర్గంలో ఆయనే బీఆర్ఎస్ పార్టీకి పెద్దదిక్కుగా ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. మళ్లీ సిర్పూర్ నియోజకవర్గంలో కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

స్వయం సమృద్ధి సాధించేలా..!

- మహిళా సంఘాలకు ఆర్థిక తోడ్పాటు
- స్త్రీనిధి లక్ష్యం రూ.45.38 కోట్లు
- ఏటా పెరుగుతున్న కేటాయింపులు
- జిల్లాలో 9,657 స్వయం సహాయక సంఘాలు



వాంకిడిలో సమావేశమైన ఎస్‌హెచ్‌జీ సభ్యులు

వాంకిడి(ఆసిఫాబాద్): మహిళా సంఘాల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో రుణాలు మంజూరు చేస్తోంది. స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకుల ద్వారా రుణాలు పొంది చిరువ్యాపారాలతో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. జిల్లాలోని మహిళలు బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలు పొందడమే కాకుండా స్త్రీనిధి బ్యాంకు ద్వారా స్వల్ప వడ్డీకి రుణాలు పొందుతూ ఉపాధి బాట పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఏటా స్త్రీనిధి లక్ష్యాలు పెంచుతూ ఐకేపీ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల్లోని ఔత్సాహిక మహిళలకు ఆర్థిక తోడ్పాటును అందిస్తోంది. 2023- 24 ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి ద్వారా రూ.39 కోట్ల రుణాలు లక్ష్యంగా మంజూరు చేయగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి మరో రూ.6 కోట్ల నిధులు పెంచారు. మొత్తంగా రూ.45,38,21000 లక్ష్యాన్ని నిర్దేశించింది.

లక్ష్యం రూ.45,38,21000...
ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్వయం సహాయక సంఘాల మహిళలకు స్త్రీనిధి పథకం ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఎంతో ఉపయోగపడుతోంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది స్త్రీనిధి లక్ష్యం రూ.6 కోట్లు పెరిగింది. మహిళలు స్వశక్తితో ఎదిగేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ముఖ్యంగా పాడి గేదెల పెంపకం, కిరాణ దుకాణాలు, జనరల్ స్టోర్లు, పిండి గిర్నీలు, గొర్రెలు, మేకలు, హోటల్స్, కూరగాయల అమ్మకం, బట్టలు, గాజుల దుకాణం, బ్యూటీపార్లర్లు, సెల్‌ఫోన్ రిపేర్, జిరాక్స్, కుట్టు మిషన్, ఎంబ్రాయిడరీ తదితర చిరు వ్యాపారాలు చేసుకునేలా ప్రోత్సహిస్తుంది. అలాగే గతేడాది నుంచి డెయిరీతోపాటు ఈ– స్కూటీ, ఈ–ఆటో, కోళ్ల పెంపకం, మదర్ యూనిట్ కింద కోడి పిల్లల వ్యాపారం, సోలార్, హౌజ్ రిపేరింగ్, జనరిక్ మెడిసిన్, టెంట్ హౌజ్, తదితర యూనిట్లపై కూడా రుణాలు మంజూరు చేస్తున్నారు. సువిధ, అక్షయ, సౌభాగ్య, ఐశ్వర్య వంటి కార్యక్రమాల ద్వారా రుణాల టార్గెట్‌ను పూర్తి చేయాల్సి ఉంది. జిల్లాలోని 15 మండలాల్లో 443 గ్రామైఖ్య సంఘాలు ఉండగా.. 431 సంఘాలు యాక్టీవ్‌గా ఉన్నాయి. వాటి పరిధిలో 9657 స్వయం సహాయక సంఘాలు కొనసాగుతున్నాయి. 2024- 2025 ఆర్థిక సంవత్సరానికి రూ.45.38 కోట్లు టార్గెట్ ఇవ్వగా.. ఇప్పటికే 12 శాతం రుణాలు మంజూరు చేసినట్లు అధికారులు తెలుపుతున్నారు. టార్గెట్‌ను మార్చి 31లోగా పూర్తి చేయాల్సి ఉంది.

గతేడాది 63 శాతం..
2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇచ్చిన లక్ష్యానికి 63 శాతం రుణాలు అందజేశారు. గతేడాది అధికారులు నిర్దేశించిన రూ.39 కోట్ల లక్ష్యానికి రూ.25 కోట్ల రుణాలను ఔత్సాహిక సంఘాలకు అందించారు. రుణాలు కేటాయించడంతోపాటు రికవరీలోనూ జిల్లా స్త్రీనిధి మేనేజింగ్ యంత్రాంగం మెరుగైన స్థితిలో ఉంది. ఇతర జిల్లాలతో పోల్చుకుంటే మెరుగైన స్థాయిలో ఉంది. 63 శాతం రుణాలు మంజూరు చేయగా.. ఇప్పటికే 75.20 శాతం రికవరీ రేటు ఉంది. జిల్లాలో ఇప్పటికే ఉన్న 9,657 స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందించేందుకు ప్రణాళికలు రూపొందించగా.. మరిన్ని సంఘాలను ఏర్పాటు చేసే ప్రక్రియను సెర్ప్ అధికారులు చేపట్టారు. మహిళా సంఘాలు ఎక్కువ ఉంటే స్త్రీనిధి లక్ష్యం మరింత చేరువలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

బీమా సౌకర్యం..
మహిళలను సంఘటితం చేసి ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రభుత్వం ఎస్‌హెచ్‌జీలోని మహిళలకు అనేక సౌకర్యాలు కల్పిస్తుంది. ఇందులో భాగంగానే స్త్రీనిధి పథకంలో లోన్ బీమా, ప్రమాద బీమా అనే రెండు బీమా పథకాలను మార్చి 14 నుంచి అమల్లోకి తెచ్చారు. స్వయం సహాయక సంఘంలోని మహిళలు బ్యాంకు ద్వారా రుణం పొంది ఉండి.. తిరిగి పూర్తిస్థాయిలో చెల్లించక ముందే సాధారణ మరణం పొందితే మిగిలిన రుణాన్ని స్త్రీనిధిలో నుంచే భరిస్తారు. ఇది రూ.2 లక్షల లోపు రుణాలు తీసుకుని ఉన్న వారికి వర్తిస్తుంది. అలాగే ప్రమాద బీమా కింద స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉన్న మహిళ ఏదైన ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబానికి రూ.10 లక్షల వరకు నగదు చెల్లిస్తారు. ప్రమాదంలో మృతి చెందిన మహిళ పేరుతో బ్యాంకులో లోన్ చెల్లించాల్సి ఉంటే అందులో డబ్బులు బీమా నుంచి కేటాయించి మిగతా వాటిని నామినీకి అందిస్తారు.

మండలాల వారీగా మహిళా సంఘాలు, స్త్రీనిధి రుణ లక్ష్యం

మండలం	ఎస్‌హెచ్‌జీలు	రుణ లక్ష్యం (రూ.కోట్లలో)
బెజ్జూర్	446	1.72
చింతలమానెపల్లి	467	2.09
దహెగాం	546	1.13
కాగజ్‌నగర్	1002	3.31
కౌటాల	592	2.62
పెంచికల్‌పేట్	270	0.90
సిర్పూర్(టి)	551	2.24
కాగజ్‌నగర్(మున్సిపాలిటీ)	970	5.18
ఆసిఫాబాద్	1039	5.18
జైనూర్	583	2.92
కెరమెరి	573	3.45
లింగాపూర్	286	1.95
రెబ్బెన	754	3.58
సిర్పూర్(యూ)	312	1.19
తిర్యాణి	514	3.69
వాంకిడి	752	4.16

లక్ష్య సాధన దిశగా ముందుకు..
2024- 25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన రుణ లక్ష్యాన్ని చేరుకునేందుకు తగిన కార్యాచరణతో ముందుకు సాగుతాం. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ క్రమం తప్పకుండా సమీక్ష, సమావేశాలు నిర్వహించాలి. మహిళలకు అవగాహన కల్పిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునేలా చర్యలు తీసుకుంటాం.
– రాంపల్లి శ్రీనివాస్, స్త్రీనిధి రీజినల్ మేనేజర్

క్లుప్తంగా

మ్యాచింగ్ గ్రాంట్ చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న మేనేజర్ తిరుపతి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 గనిలో ఇటీవల మృతి చెందిన శ్రీనివాస్ (జనరల్ మజ్దూర్) కుటుంబానికి కంపెనీ మ్యాచింగ్ గ్రాంట్ అందించింది. శుక్రవారం గని మేనేజర్ తిరుపతి మృతుని భార్య శ్రీలతకు రూ.7.5 లక్షల మ్యాచింగ్ గ్రాంట్ చెక్కు అందజేశారు. మృతుని కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య, ఫిట్ సెక్రెటరీ సంఘం సదానందం తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవులు మృతి



మృతి చెందిన ఆవులు

బెల్లంపల్లిరూరల్: విద్యుదాఘాతంతో మూడు ఆవులు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మాలగురిజాల గ్రామంలో గోమాస ప్రకాష్, గోమాస రాజేశ్, రంగపేటలో పట్టి రాజుకు చెందిన ఆవులు శుక్రవారం గ్రామ శివారులోని పంటచేలలో మేత మేస్తుండగా తెగిపడిన విద్యుత్ తీగను తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. స్థానికుల సమాచారంతో ఘటన స్థలాన్ని విద్యుత్ శాఖ సిబ్బంది సందర్శించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ఇసుక డంప్‌లు స్వాధీనం



స్వాధీనం చేసుకుంటున్న మైనింగ్ ఏడీ

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌లను సీజ్ చేసినట్లు మైనింగ్ ఏడీ గంగాధర్ తెలిపారు. పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తూ మండల కేంద్రంలో నిల్వ చేస్తున్నారనే పక్కా సమాచారంతో సోదాలు నిర్వహించగా వేముల మోహన్ వద్ద వంద ట్రిప్పులు, మిట్ట రమేశ్ వద్ద 20 ట్రిప్పులు, సముద్రాల సత్యనారాయణ వద్ద 50 ట్రిప్పులు, రావుల సంతోష్ వద్ద 35, లోనకరి రమేశ్ వద్ద 20 ట్రిప్పుల ఇసుక లభ్యమైనట్లు తెలిపారు. నిల్వలను స్వాధీనం చేసుకొని వారిపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్ రెడ్డి, ఆర్ఐ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయిలో శుక్రవారం గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రవికుమార్ తెలిపారు. గతంలో నాటుసారా తయారు చేసిన ఎనిమిది మందిని తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు ఎదుట బైండోవర్ చేశారు.

పరిషత్‌లలో ప్రత్యేక పాలన?

- జూలై 4, 5 తేదీల్లో ముగియనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీకాలం
- 'స్థానిక' ఎన్నికల నిర్వహణపై స్పష్టత కరువు
- కులగణన తర్వాతే చేపట్టాలని పలువురి డిమాండ్

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	ఎంపీటీసీలు	జెడ్పీటీసీలు
ఆదిలాబాద్	168	17
నిర్మల్	156	18
మంచిర్యాల	130	16
కుమురంభీం	125	15



ఆదిలాబాద్ జిల్లా పరిషత్ కార్యాలయం

నిర్మల్ చైన్‌గేట్/కైలాస్‌నగర్: గ్రామ పంచాయతీల మాదిరిగానే జిల్లా, మండల ప్రజా పరిషత్‌లు కూడా త్వరలోనే ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లనున్నాయి. ఎందుకంటే జూలై 4, 5 తేదీల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం పూర్తికానుంది. ఈలోగా ఎన్నికలు నిర్వహించడం అసాధ్యం. ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు. ఇప్పటికిప్పుడు ప్రభుత్వం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించినా ఎన్నికల నిర్వహణకు సమయం పట్టే అవకాశముంది. దీంతో గ్రామ పంచాయతీల మాదిరిగానే మండల, జిల్లా పరిషత్‌ల్లోనూ ప్రత్యేకాధికారుల పాలనే అమలులోకి వచ్చే అవకాశం కన్పిస్తోంది. ప్రభుత్వం నుంచి ఇంకా దీనిపై ఎలాంటి ప్రకటన రానప్పటికీ ప్రత్యేకం అనివార్యం కానుందనే ఉద్దేశంతో అధికారులు ఆదిశగా కసరత్తు చేస్తున్నారు.

ఎన్నికల నిర్వహణ లేనట్లే

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 579 మంది ఎంపీటీసీ సభ్యులు, 66 మంది జెడ్పీటీసీ సభ్యులు ఉన్నారు. ఇందులో ఎంపీటీసీ, ఎంపీపీల పదవీ కాలం జూలై 4వ తేదీతో ముగియనుండగా జిల్లా పరిషత్ సభ్యుల పదవీ కాలం జూలై 5తో ముగియనుంది. వీటికి ఇప్పట్లో ఎన్నికలు జరిగేలా కన్పించడం లేదు. 2019లో ఎంపీటీసీ, జెడ్పీటీసీల పాలకవర్గాల నిర్ణీత గడువు కంటే రెండు నెలల ముందుగానే అప్పటి ప్రభుత్వం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించింది.

కానీ రాష్ట్రంలో అధికారం చేపట్టిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వీటి నిర్వహణకు అంత ఆసక్తి చూపనట్లు తెలుస్తోంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన వెలువడకపోవడంతో సర్పంచ్‌ల తరహాలోనే ప్రత్యేకాధికారుల పాలన అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నట్లుగా అధికారులు చెబుతున్నారు.

ప్రత్యేకాధికారుల పాలన అనివార్యం కానుండడంతో ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రానప్పటికీ ఉమ్మడి జిల్లా యం

అధికారుల కసరత్తు

త్రాంగం ఆదిశగా ముందుగానే కసరత్తు ప్రారంభించింది. జిల్లా పరిషత్‌లకు ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక మండల పరిషత్‌లకు జిల్లాస్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించనున్నారు. ఇప్పటికే అన్ని మండలాలకు ఏదో ఒక శాఖ జిల్లాస్థాయి అధికారి మండల ప్రత్యేకాధికారిగా ప్రభుత్వ కార్యక్రమాల అమలును పర్యవేక్షిస్తున్నారు. దీంతో వారినే మండల పరిషత్‌లకు ప్రత్యేకాధికారిగా నియమిస్తారా? లేక మరో జిల్లా స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగిస్తారా? అనేదీ త్వరలోనే తేలనుంది.

రిజర్వేషన్లపై ఉత్కంఠ

ప్రభుత్వం ఇప్పటికిప్పుడు ఎన్నికలకు సిద్ధమైనప్పటికీ ఎన్నికల నిర్వహణ సాధ్యమయ్యే అవకాశం ఉండదు. రిజర్వేషన్లు, ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల సిబ్బందికి శిక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది. వీటికే రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. కనుక ఇప్పట్లో ఎన్నికలు లేనట్లుగానే కన్పిస్తోంది. ఎన్నికల మాట అటుంచితే పోటీకి తహతహలాడుతున్న అభ్యర్థులను రిజర్వేషన్ల అంశం ఆందోళనకు గురిచేస్తోంది. పంచాయతీ రాజ్ చట్టాన్ని సవరించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు పదేళ్ల పాటు ఒకే రిజర్వేషన్ కొనసాగేలా చట్టం చేసింది. దాని ప్రకారంగానే 2019లో ఎన్నికలు నిర్వహించింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అప్పటి సర్కారు ప్రకటించిన రిజర్వేషన్ల ప్రకారంగానే ఎన్నికలు నిర్వహిస్తుందా? లేక చట్టసవరణతో కొత్త రిజర్వేషన్లను ప్రకటిస్తుందా? అనేదానిపై అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. బీసీ కుల గణనకు ప్రభుత్వం మొగ్గు చూపుతుండటం, కొత్తగా మండలాలు ఏర్పడిన నేపథ్యంలో రిజర్వేషన్ల సవరణ అనివార్యమనే భావన కూడా రాజకీయ పార్టీల్లో వ్యక్తమవుతోంది. అయితే దీనిపై ప్రభుత్వం దీనిపై ఏదైనా ప్రకటన చేస్తే తప్ప దీనిపై స్పష్టత వచ్చే అవకాశం కన్పించడం లేదు.

నాణ్యమైన పనిముట్లు సరఫరా చేయాలి



కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

శ్రీరాంపూర్: గనిలో పనిచేసే కార్మికులకు నాణ్యమైన పనిముట్లను సరఫరా చేయాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు సంస్థ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆ యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా శుక్రవారం ఆర్కే న్యూటెక్ గనిని సందర్శించి కార్మికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గని మేనేజర్‌ను కలిసి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యతలేని పనిముట్లు సరఫరా చేయడం వల్ల కార్మికులకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎస్డీఎల్ యంత్రాలలో ఉపయోగించే ఆయిల్స్ నాణ్యత లేనందువలన యంత్రాలు మొరాయిస్తున్నాయన్నారు. దీనివలన ఆపరేటర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాణ్యమైన పనిముట్లతో పాటు ఆపరేటర్లకు, ట్రేడ్స్‌మెన్లకు గ్లౌజులు సరఫరా చేయాలన్నారు. మేనేజర్ సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏ.సంపత్, పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు చంద్రమౌళి, సకినాల నరసయ్య, సిద్దం అజయ్, రాజయ్య పాల్గొన్నారు.

తెలంగాణ కీర్తిని చాటాలి



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

- మంచిర్యాల జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి
- రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి

మంచిర్యాలటౌన్: రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులు తెలంగాణ కీర్తిని జాతీయస్థాయిలో చాటాలని మంచిర్యాల జెడ్పీచైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని గ్రీన్‌సిటీలో గల మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనిక్స్ సన్‌రైస్ సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రాణించిన వారికి మంచి అవకాశాలు వస్తాయన్నారు. డీఎఫ్‌వో శివ ఆశిష్ మాట్లాడుతూ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య మాట్లాడుతూ మంచిర్యాలలో క్రీడలు నిర్వహించే వారికి తమ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ బాబు, టోర్నమెంటు కన్వీనర్ గాజుల ముఖేశ్‌గౌడ్ మాట్లాడుతూ అందరి సహకారంతో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ విప్ నల్లాల ఓదెలు, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్ కుమార్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నల్ల శంకర్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ల వాసు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్లూరి సుధాకర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, డీవైఎస్‌వో కీర్తి రాజ్‌వీర్, తదితరులు పాల్గొన్నారు.

ఈపీ ఆపరేటర్లను బదిలీ చేయొద్దు



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే ఓసీ నుంచి ఈపీ ఆపరేటర్లను డిప్యూటేషన్ పేరిట యాజమాన్యం మణుగూరుకు బదిలీ చేయాలని చూస్తోందని, ఈ చర్యను యాజమాన్యం మానుకోవాలని ఐఎన్టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కేకే ఓసీ వద్ద నాయకులు ఆందోళన నిర్వహించి గని మేనేజర్ వీరయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షులు దేవీ భూమయ్య, కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షులు కాంపల్లి సమ్మయ్య, పిట్ కార్యదర్శి సాంబయ్య, నాయకులు నరేందర్, లక్ష్మణ్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా చెల్లించాలి



ధర్నా చేస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా చెల్లించాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సివిల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారే తప్ప వారికి కనీస వేతనాలు కూడా అమలు చేయడంలేదన్నారు. లాభాల్లో వాటా తప్పక చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం, శంకర్, వెంకటేష్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనల ద్వారానే విజ్ఞాన పురోగతి



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నిర్మలఖిల్లా: మానవ జీవితం రసాయన శాస్త్ర అధ్యయనం, పరిశోధనతోనే ముడిపడి ఉందని ప్రముఖ పరిశోధకులు, బెంగళూరుకు చెందిన ప్రఖ్యాత సంస్థ ఏరింగ్ ప్రోదేవ్ కంపెనీ సీఈవో డాక్టర్ ఎల్.రాజేందర్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించనున్న రసాయన శాస్త్ర జాతీయస్థాయి సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ప్రధాన వక్తగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. రసాయన పరిశోధనలు మానవ జీవితం సుస్థిరాభివృద్ధిని సులభతరం చేస్తుందన్నారు. రసాయన శాస్త్ర రంగంలో సుదీర్ఘమైన భవిష్యత్తు ఉందని విద్యార్థులు తమ కెరియర్‌ను ఈ రంగం వైపు మరల్చుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జే.భీమారావు మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు నిర్మల్ జిల్లా కేంద్రంలో కొనసాగడం వల్ల స్థానికంగా విద్యార్థులను రసాయన పరిశోధనలపట్ల ప్రసక్తి పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రకృతిలో హానికారక రసాయనాలను తొలగించడానికి హరిత రసాయన శాస్త్ర పద్ధతులను వినియోగించాలని ప్రొఫెసర్ దిలీప్ స్వామి సూచించారు. అనంతరం సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సదస్సు సమన్వయకర్త సరిత రాణి, కో కన్వీనర్ రమాకాంత్ గౌడ్, ప్రముఖ పరిశోధకులు డాక్టర్ సంపత్ కుమార్, దేశంలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

101వ పుట్టినరోజు వేడుకలు

మంచిర్యాలటౌన్: పట్టణానికి చెందిన పుల్లూరి వెంకటలక్ష్మీరాజం గుప్తా 101వ పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం జిల్లా కేంద్రంలో కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. పెద్ద కూతురు వెంకటలక్ష్మీ, శివరాణి, మనుమలు, మనుమరాళ్లు మొత్తంగా 200ల మంది కుటుంబ సభ్యులతో కలిసి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.



వేడుకలు జరుపుకొంటున్న వెంకటలక్ష్మీరాజం

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి



దుప్పికి చికిత్స అందిస్తున్న అటవీ సిబ్బంది

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి రేంజ్ పరిధిలోని గూడెం వద్ద కుక్కల దాడిలో శుక్రవారం చుక్కల దుప్పి మృతి చెందింది. గూడెం సమీపంలోని అటవీ ప్రాంతంలో కుక్కలు చుక్కల దుప్పిపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. గమనించిన గ్రామస్తులు అటవీ సిబ్బందికి సమాచారం అందించారు. అటవీ సెక్షన్ అధికారి అక్తర్ వైద్యం అందించే ప్రయత్నం చేశారు. తీవ్రంగా గాయపడడంతో దుప్పి మృతి చెందింది. అటవీ శాఖ ఆధ్వర్యంలో దుప్పికి పంచనామా నిర్వహించి అటవీ ప్రాంతంలో పాతి పెట్టారు. కుక్కలు దాడి చేయడంతో గత వారంరోజుల్లో అటవీ వన్య ప్రాణులు మృతి చెందడం ఇది రెండవ సారి. బాలాజీ అనుకోడ సమీపంలో వారం క్రితం ఒక జింక మృతి చెందగా తాజాగా దుప్పి మృతి చెందింది.

ఐకే 1ఏ గనిలోకి ఎస్‌డీఎల్ యంత్రం



గనిలోకి యంత్రం దింపుతున్న అధికారులు

జైపూర్: మండలంలోని ఇందారం ఐకే1ఏ గనిలోకి శుక్రవారం ఎస్‌డీఎల్ ఎస్–23 యంత్రాన్ని దించారు. ఈ సందర్భంగా ఐకేఓసీపీ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ఏడాది వార్షిక బొగ్గు ఉత్పత్తి సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఉత్పత్తి ఉత్పాదక సాధన కోసం నూతన యంత్రాలను గనిలోకి దింపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఇంజనీర్ నాగన్న, అండర్ మేనేజర్లు అనిల్, చంద్రశేఖర్‌రెడ్డి, గని సంక్షేమాధికారి రమేశ్, యూనియన్ నాయకులు నవీన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి

ఆసిఫాబాద్‌రూరల్: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఒకరు మృతి చెందిన ఘటన శుక్రవారం ఆసిఫాబాద్ మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ మండలం భీంపూర్ గ్రామానికి చెందిన చందు(60) శుక్రవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని పెద్దవాగుకు చేపల వేటకు వెళ్లాడు. చెక్‌డ్యాం పైనుంచి వల విసురుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి నీళ్లలో పడిపోయాడు. గురువారం కురిసిన వర్షానికి వాగులో ప్రవాహం ఎక్కువగా ఉండటంతో బయటికి రాలేక నీట మునిగి మృతి చెందాడు. మృతుడికి ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ పరామర్శించారు.

పిడుగుపాటుకు సామగ్రి దగ్ధం

నస్పూర్: పిడుగుపాటుతో మంటలు చెలరేగి ఇంట్లోని సామగ్రి దగ్ధమైన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ప్రశాంత్ నగర్‌లో నివాసం ఉంటున్న గంగిపల్లి సురేశ్ ఉద్యోగ రీత్యా వేరే ఊరికి వెళ్లాడు. అతని భార్య శిరీష సమీపంలోని తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో దట్టమైన పొగతో కూడిన మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఫైర్ అధికారి దేవేందర్‌ను వివరణ కోరగా ఇంటిపై పిడుగుపడి ప్రమాదం జరిగి ఉంటుందన్నారు. ప్రమాదంలో రూ.30 వేల నగదు, సుమారు రూ.4లక్షల విలువైన సామగ్రి, సర్టిఫికెట్లు దగ్ధమయ్యాయని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

అద్దె వాహనాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని ఏరియా ఆస్పత్రి, మాదారం, గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి డిస్పెన్సరీలలో యూనిట్ రేట్ సిస్టం ప్రకారం అద్దె ప్రతిపాదికన ఐదేళ్ల కాల పరిమితితో 3 ఏసీ అంబులెన్స్‌ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సింగరేణి యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. సింగరేణి భూనిర్వాసితులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. జూలై 17న సాయంత్రం 4గంటల లోగా దరఖాస్తులు జీఎం కార్యాలయంలో అందించాలని సూచించారు. పూర్తి వివరాలకు జీఎం కార్యాలయంలోని పర్చేస్ డిపార్టుమెంట్‌లో సంప్రదించాలని కోరారు.

బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్

రామకృష్ణాపూర్: స్థానిక సింగరేణి ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం ఏరియా జీఎం మనోహర్, సేవా సమితి ఏరియా అధ్యక్షురాలు సవిత మనోహర్ బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్‌ను ప్రారంభించారు. సంస్థ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సింగరేణి యాజమాన్యం నిర్వహిస్తున్న ఇలాంటి క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి అక్బర్‌అలీ, సీఎంఓఏఐ ఏరియా అధ్యక్షుడు రమేశ్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఏసీఎంఓ ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కాంట్రాక్ట్ సొసైటీ ఎన్నికలు ఖరారు

చెన్నూర్: చెన్నూర్ లేబర్ కాంట్రాక్టు కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పాలక మండలి ఎన్నికలు ఖరారైనట్లు ఎన్నికల అధికారి బి.నరేశ్ తెలిపారు. పాలక మండలి 9 మంది సభ్యులకుగానూ సంఘ కార్యాలయంలో జూలై 1 నుంచి 3 వరకు నామినేషన్లు, 4న పరిశీలన, 5న ఉప సంహరణ ఉంటుందన్నారు. 9 కంటే ఎక్కువ నామినేషన్లు దాఖలైతే జూలై 10న రహస్య బ్యాలెట్ పద్ధతి ద్వారా ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గెలుపొందిన సభ్యులతో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శిని ఎన్నుకోనున్నట్లు తెలిపారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

జైనథ్: మండలంలోని దీపాయిగూడకు చెందిన సుర్కుంటి ఆశారెడ్డి (37)ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దీపాయిగూడకు చెందిన ఆశారెడ్డికి ఆదిలాబాద్‌కు చెందిన కృష్ణవేణితో వివాహమైంది. దంపతులకు పాప, బాబు ఉన్నారు. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరగడంతో ఇద్దరు పిల్లలతో కలిసి కృష్ణవేని ఆదిలాబాద్‌లో ఉంటోంది. భార్యాభర్తల నడుమ కోర్టు కేసులు సైతం నడుస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం సాయంత్రం మద్యం మత్తులో ఇంట్లో ఉరేసుకున్నాడు. బయటకు వెళ్లిన తల్లి ఇంటికి వచ్చేసరికి ఉరేసుకుని కనిపించాడు. పోలీసులు ఇంకా కేసు నమోదు చేయకపోవడంతో మృతికి గల కారణాలు తెలియరాలేదు.

నార్త్ తెలంగాణ రైల్వే ఫోరం ఏర్పాటు

మంచిర్యాలఅర్బన్: ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్‌తో పాటు మెదక్ జిల్లాకు చెందిన ప్రయాణికుల సమస్యలు, రైళ్ల అప్‌డేట్‌కు ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా కె.ఫణిరాజ్ (పెద్దపల్లి), ప్రధాన కార్యదర్శిగా కలవేణి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా అజయ్ క్రాంతి సింగ్ ఠాకూర్, జాయింట్ సెక్రటరీగా సిరిపురం సాయికృష్ణ, ట్రెజరీగా మోహన్ గంగు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా దేవి సింగ్, అందే వెంకటేశ్‌తో ఫోరం ఏర్పాటు చేశారు. ఉత్తర తెలంగాణ ప్రాంతంలోని రైలుమార్గాల్లో నూతన రైళ్ల ప్రతిపాదనలు, స్టేషన్లో నెలకొన్న సమస్యలు, ప్రయాణికుల రద్దీని బట్టి రైళ్ల సంఖ్యను పెంచేలా అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లేలా ఫోరం కృషిచేస్తుందని ఫోరం అధ్యక్షుడు కంకటి ఫణిరాజ్ 'సాక్షి'కి తెలిపారు.